

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.21

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.21 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
36.4°/23.8°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికంగా ఉంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

సబ్ స్టేషన్ల పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం టౌన్: జిల్లావ్యాప్తంగా జరుగుతున్న విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు 1912 టోల్ ఫ్రీకి ఫోన్ చేయాలని, వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ జేవీ రమేష్‌తోపాటు డీఈలు, ఏడీలు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి పాటుపడదాం



జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఈఓ ఓబుళమ్మ

అనంతపురం సిటీ: 'పాలకవర్గం, అధికారులు, ఉద్యోగులు పరస్పర సహకారం, సమన్వయంతో పని చేద్దాం. జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడదాం' అని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జెడ్పీ సీఈఓ (ఎఫ్ఏసీ)గా నియమితులైన చిలంకూరు ఓబుళమ్మ శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెడదామని సూచించారు.

నాలుగు కీలక శాఖల్లో ఆమే..

అధికార పార్టీలో బలమైన సామాజిక వర్గానికి చెందిన ఓబుళమ్మ సీఈఓ పోస్టు కోసం శతవిధాలా ప్రయత్నించినట్లు తెలిసింది. రాష్ట్ర స్థాయి హోదా కలిగిన ప్రజాప్రతినిధిని కలిసి జిల్లాధికారులపై ఒత్తిడి చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే జెడ్పీ సీఈఓగా ఓబులమ్మను నియమిస్తూ కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ శనివారం ఉదయం ఉత్తర్వులు జారీ చేయగా, వెంటనే ఆమె ఇన్‌చార్జ్ సీఈఓ ప్రభాకర్‌రావు నుంచి చార్జ్ తీసుకున్నారు. ఇదిలా ఉంటే, ఇప్పటికే నాలుగు కీలక పోస్టుల్లో ఓబుళమ్మ కొనసాగుతున్నారు. అనంతపురం రెగ్యులర్ డీఎల్‌డీఓగా ఉన్న ఆమెకు ఇటీవల గుంతకల్లు ఇన్‌చార్జ్ డీఎల్‌డీఓ బాధ్యతలు అప్పగించారు. డీఆర్‌డీఏ పీడీగానూ ఎఫ్ఏసీ బాధ్యతలు కట్టబెట్టారు. ఇప్పుడు జెడ్పీ సీఈఓ పోస్టులో కూర్చోబెట్టారు. ఇలా కీలక పోస్టులన్నీ ఆమెకే కట్టబెట్టడంపై ఆయా శాఖల ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

నెలరాజులు..!





జూన్ 4న ఎన్నికల ఫలితాల మొదలు జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. కూటమి నేతలు రాజకీయ ప్రత్యర్థులపై ఇష్టారాజ్యంగా దాడులు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. మరోవైపు అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయి. దొంగతనాలు పెరిగిపోయాయి. విచ్చలవిడిగా పేకాట స్థావరాలు వెలిశాయి. దిశానిర్దేశం చేసేవారు కరువై పోలీసు వ్యవస్థలో స్తబ్ధత నెలకొంది. ఇంత జరుగుతున్నా, ప్రభుత్వం మాత్రం పోలీసు బాస్‌లను మారుస్తూ కాలక్షేపం చేస్తోంది.

జిల్లాకు ఐదు నెలల్లో ఐదుగురు ఎస్పీలు

- ఎవరు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్లిపోతారో తెలియని పరిస్థితి
- ఎస్పీల బదిలీలపై పోలీసు వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి
- జేసీకీ ఆర్డర్ ఇచ్చి వెనక్కు తీసుకున్న సర్కారు
- పాలనాపరంగా జిల్లాలో అనిశ్చితి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఐదు నెలల్లో ఐదుగురు ఎస్పీలను చూసిన ఘనత జిల్లాకే దక్కింది. మార్చి నుంచి ఇప్పటి వరకూ జిల్లాకు ఐదుగురు ఎస్పీలు వచ్చారు. నెలకొకరు చొప్పున పోలీసు ఉన్నతాధికారులను మారుస్తుండటంతో జిల్లాలో శాంతిభద్రతలు క్షీణించాయి.

అన్బురాజన్ నుంచి జగదీష్ వరకూ..

మార్చి 16న ఎన్నికల నోటిఫికేషన్ రాగా, కొన్ని రోజులకే అప్పటి ఎస్పీ అన్బురాజన్‌పై టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి ఇక్కడి నుంచి వెళ్లేలా చేశారు. అలా మొదలైన ఎస్పీల బదిలీల పరంపర నేటికీ కొనసాగుతూనే ఉంది.

తాడిపత్రి దాడులతో బర్దార్ గల్లంతు..

అన్బురాజన్ తర్వాత వచ్చిన ఎస్పీ అమిత్ బర్దార్ టీడీపీకి ఏకపక్షంగా పనిచేశారు. తాడిపత్రిలో పోలింగ్ రోజున అల్లర్లను అదుపు చేయలేకపోయారు. దీంతో ఎన్నికల కమిషన్ ఆయన్ను సస్పెండ్ చేసింది.అంతకుముందు అనంతపురంలో టీడీపీ నేత కందికుంటప్రసాద్‌కు చెందిన కారులో రూ.2 కోట్లు దొరికితే అమిత్ బర్దార్ కనీసం చర్యలు తీసుకోలేకపోయారు. పైగా డబ్బు పట్టుకున్న కిందిస్థాయి పోలీసులనే అనుమానించారు. ఎన్నికల వేళ జరిగిన పరిణామాలతో ఆయన సస్పెండ్ అవ్వడం, ఆ తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి పోస్టింగ్ తెచ్చుకోవడం జరిగాయి.

గౌతమి శాలిని పనిచేయనివ్వలేదు..

అమిత్ బర్దార్ సస్పెన్షన్ అనంతరం మహిళా ఐపీఎస్ గౌతమి శాలిని ఎస్పీగా నియమించారు. వివాదాలకు దూరంగా ఉంటూ నిక్కచ్చిగా పనిచేసే ఈమెను టీడీపీ నేతలు ఎక్కువ రోజులు పనిచేయనివ్వలేదు. తమకు అనుకూలంగా పనిచేయడం లేదంటూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొన్ని రోజులకే అధిష్టానంపై ఒత్తిడి తెచ్చారు. గౌతమి శాలిని బదిలీ చేయించారు.

మురళీకృష్ణకు ముగిసిన పదవి..

గౌతమిశాలి అనంతరం మురళీకృష్ణకు పోస్టింగ్ వచ్చింది. ఈయన కూడా టీడీపీ నేతలు దాడులు చేస్తుంటే కనీసం కేసులు పెట్టడానికి కూడా పోలీసులకు అవకాశం ఇవ్వలేదు. గంజాయి, మద్యం విచ్చలవిడిగా సరఫరా అవుతున్నా, టీడీపీ నేతలు చౌక బియ్యాన్ని యథేచ్ఛగా బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నా చర్యలు లేవు. ముఖ్యంగా తాడిపత్రి అల్లర్ల కేసులో బెయిల్ వచ్చిన జేసీ ప్రభాకర్‌రెడ్డిని పట్టణానికి రానిచ్చారు గానీ, అదే కేసులో బెయిల్ పొందిన పెద్దారెడ్డిని మాత్రం అడ్డుకున్నారు. ఇంత చేసినా మురళీకృష్ణను తాజాగా బదిలీ చేయడం గమనార్హం.

ఈయనెలా పనిచేస్తారో..?

జిల్లా ఎస్పీగా జగదీష్‌ను ప్రభుత్వం తాజాగా నియమించింది. ఐదో కృష్ణుడిగా వస్తున్న ఈయన ఏ మేరకు పనిచేస్తారోనని పోలీసులే సందేహిస్తున్నారు. రోజుకో ఎస్పీ మారుతుండటంతో పోలీసు వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఏం చేస్తే ఎలా మీదికొస్తుందో అర్థం కాని పరిస్థితి ఉందని పోలీసు సంఘం ప్రతినిధి ఒకరు వాపోయారు.

ఐఏఎస్ హరితకు చేదు అనుభవం..

ఐపీఎస్‌లే కాదు ఐఏఎస్‌లనూ ప్రభుత్వం వదలడం లేదు. ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా డి.హరిత నియమితులయ్యారు. ఈనెల 14న ఆమె విధుల్లో చేరడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే, ఆమె బాధ్యతలు చేపట్టకముందే నియామకాన్ని రద్దుచేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. హరిత అవినీతిపరురాలు అంటూ నెల్లూరు జిల్లాకు చెందిన ఓ టీడీపీ నేత సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తే నియామకం రద్దు చేయడం గమనార్హం. దీంతో ఐఏఎస్ అధికారుల్లోనూ అసంతృప్తి నెలకొంది. జిల్లాకు 15 రోజులుగా జాయింట్ కలెక్టర్ లేకపోవడంతో పాలనాపరంగానూ స్తబ్ధత నెలకొంది.

జిల్లా అంతటా వాన

- పుట్లూరు మండలంలో కుండపోత
- రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన




పుట్లూరు మండలం అరకటివేముల వద్ద నేలకొరిగిన మొక్కజొన్న పొలం

అనంతపురం అగ్రికల్చర్: అల్పపీడన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా భారీ వర్షాలు కురిశాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. 31 మండలాల పరిధిలో ఒకే రోజు రికార్డు స్థాయిలో 54.8 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. పుట్లూరు మండలంలో ఏకంగా 138.8 మి.మీ కుండపోత వర్షం కురిసింది. ఆత్మకూరు 88.2 మి.మీ, బుక్కరాయసముద్రం 88 మి.మీ, రాప్తాడు 86.4 మి.మీ, శింగనమల 85.4 మి.మీ, యాడికి 82 మి.మీ, కళ్యాణదుర్గం 75.4 మి.మీ, నార్పల 70.8 మి.మీ, పామిడి 69.4 మి.మీ, శెట్టూరు 68.2 మి.మీ, ఉరవకొండ 65.8 మి.మీ, వజ్రకరూరు 64.4 మి.మీ, కంబదూరు 64.2 మి.మీ, గుత్తి 60.6 మి.మీ, తాడిపత్రి 58.4 మి.మీ, యల్లనూరు 56.8 మి.మీ, బ్రహ్మసముద్రం 53.2 మి.మీ మేర భారీ వర్షం కురిసింది. అలాగే విడపనకల్లు 47.4 మి.మీ, గార్లదిన్నె 46.8 మి.మీ, అనంతపురం 45 మి.మీ, కుందుర్పి 43.6 మి.మీ, డి.హీరేహాళ్ 43 మి.మీ, బొమ్మనహాళ్ 40 మి.మీ, పెద్దపప్పూరు 35.4 మి.మీ, కూడేరు 26.4 మి.మీ, గుంతకల్లు 26.2 మి.మీ, రాయదుర్గం 20.2 మి.మీ, బెళుగుప్ప 17.8 మి.మీ, గుమ్మఘట్ట 16.4 మి.మీ, కణేకల్లు 10.2 మి.మీ, పెద్దవడుగూరు 5.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా అంతటా మంచి పదును వర్షం పడటం ఏడాది తర్వాత మొదట సారి కావడం విశేషం. దీంతో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగి ప్రవహించాయి. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

229 హెక్టార్లలో పంట నష్టం

భారీ వర్షాలకు 229 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. రూ.1.06 కోట్ల వరకూ పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. 10 మండలాల పరిధిలో 89 హెక్టార్లలో మొక్కజొన్న, 32 హెక్టార్లలో కంది, 22 హెక్టార్లలో వేరుశనగ, 15 హెక్టార్లలో మినుము, 15 హెక్టార్లలో పత్తి, 14 హెక్టార్లలో వరి, 12 హెక్టార్లలో సోయాబీన్ మొత్తం 196 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో రైతులకు రూ.53 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు జేడీఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కంబదూరు, శెట్టూరు, కుందుర్పి, గుమ్మఘట్ట, శింగనమల, పెద్దపప్పూరు, యల్లనూరు మండలాల పరిధిలో అరటి, బీర, టమాట, మిరప, కర్బూజా తదితర పంటలు 33 హెక్టార్లలో దెబ్బతినడంతో రైతులకు రూ.53 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా



అనంతపురం అర్బన్: ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 19న ప్రారంభించి 31వ తేదీలోగా బదిలీల ప్రక్రియ ముగించాలని ఆదేశించింది. ఎక్సైజ్ శాఖలో బదిలీలు సెప్టెంబరు 5 నుంచి అదే నెల 15వ తేదీ వరకు నిర్వహించుకోవచ్చని ఉత్తర్వులో పేర్కొంది.

- కొన్ని శాఖలు సొంతంగా మార్గదర్శకాలు రూపొందించుకునే వెసలుబాటును ప్రభుత్వం కల్పించింది. వాణిజ్య పనులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్, రవాణా, వ్యవసాయ శాఖలు సొంతంగా మార్గదర్శకాలు రూపొందించుకుని బదిలీల ప్రక్రియ చేపట్టవచ్చు. అయితే ప్రభుత్వం సాధారణ బదిలీల కోసం నిర్దేశించిన తేదీలోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఒకేచోట ఐదేళ్లు పూర్తయితే తప్పనిసరి..

బదిలీలకు సంబంధించి అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఏడాది జూలై 31వ తేదీకి ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగుల బదిలీ తప్పనిసరి. సర్వీసుతో నిమిత్తం లేకుండా బదిలీ కోసం ఉద్యోగులు అభ్యర్థన పెట్టుకోవచ్చు.

ఈ శాఖల్లోనే బదిలీలు..

రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ఫ్, పట్టణాభివృద్ధి, మునిసిపల్ పరిపాలన, గ్రామవార్డు సచివాలయాలు, పౌర సరఫరాలు, భూగర్భగనులు, అన్ని ఇంజినీరింగ్ శాఖలు, దేవదాయ, రవాణా, అటవీ, పరిశ్రమలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖల్లో బదిలీలు నిర్వహిస్తారు. రోజువారీ పరిపాలన వ్యవహారాలతో సంబంధం లేని విద్య, వైద్య శాఖల ఉద్యోగులకు బదిలీలు ఉండవు.

వీరికి ప్రాధాన్యం..

సాధారణ బదిలీల్లో కొన్ని కేటగిరీల ఉద్యోగులకు ప్రాధాన్యం ఉంటుంది. అంధులు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి పనిచేస్తున్న వారు, 40 శాతం.. అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు, మానసిక వైకల్యం ఉన్న సంతానం కలిగిన వారికి బదిలీల్లో ప్రాధాన్యత ఉంటుంది. అదే విధంగా ఉద్యోగిపై ఆధారపడిన కుటుంబసభ్యులు, వారి తల్లిదండ్రులు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నా, వారికి వైద్య సదుపాయం కోసం అవసరమైన ప్రాంతాలకు బదిలీ చేసేందుకు ప్రాధాన్యత ఇస్తారు.

'వికసిత్ ఆంధ్ర' ప్రణాళిక రూపొందించండి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'వికసిత్ ఆంధ్ర' కార్యక్రమానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. తమ శాఖల పరిధిలో మూడు స్థాయుల్లో ప్రణాళికలను సిద్ధం చేయాలని చెప్పారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఏడాది కార్యాచరణ ప్రణాళిక, వికసిత్ ఆంధ్ర కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్ చేయించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేయడంపై అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శనివారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు పక్కాగా అందించేలా చూడాలన్నారు. తాడిపత్రిలో నెల రోజుల్లో పెట్రోల్ బంకు ఏర్పాటు కావాలని, జన ఔషధి కేంద్రాలను ఆసుపత్రుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది నియామకం నిబంధనల ప్రకారం జరగాలన్నారు. గోడౌన్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో రామకృష్ణారెడ్డి, డీసీఓ అరుణకుమారి, డీఆర్డీఏ పీడీ ఓబుళమ్మ, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

21న ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్

అనంతపురం అర్బన్: ఎస్సీ, ఎస్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జేసీగా శివ నారాయణ శర్మ



అనంతపురం అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టరుగా శివ నారాయణ శర్మ నియమితులయ్యారు. ఈయన 2021 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం కర్నూలు జిల్లా ఆదోని సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈయన్ను జిల్లా జేసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

సందేహం.. సాగు గణాంకం

- ఖరీఫ్‌లో వర్షాలు లేకున్నా పంటల విస్తీర్ణం పెంచి చూపిస్తున్న వ్యవసాయ శాఖ
- తాజాగా ఖరీఫ్‌లో 58 శాతం విస్తీర్ణంలో పంటలు సాగైనట్లు నివేదిక
- పల్లెపల్లెలో సిబ్బంది ఉన్నా పక్కా గణాంకాల సేకరణలో విఫలం



కళ్యాణదుర్గం వద్ద సాగైన వేరుశనగ పంట

వ్యవసాయశాఖ తాజా నివేదిక ప్రకారం ఖరీఫ్‌లో సాగైన పంటల వివరాలు ఇలా(హెక్టార్లలో)

పంట పేరు	సాధారణ విస్తీర్ణం	సాగైన విస్తీర్ణం	సాగు శాతం
వేరుశనగ	1,97,884	83,715	42
కంది	37,367	54,919	147
పత్తి	48,586	24,749	51
ఆముదం	16,340	16,919	104
మొక్కజొన్న	11,544	10,736	93
వరి	18,299	3,362	18
కొర్ర	2,001	3,280	164
సజ్జ	1,610	2,415	150
జొన్న	5,036	510	10
పెసర	1,006	100	10
మినుము	221	278	126
పొద్దుతిరుగుడు	1,725	546	32
సోయాబీన్	551	390	71

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయశాఖ ఖరీఫ్ పంటల సాగుపై ఇస్తున్న గణాంకాలు సందేహాస్పదంగా మారాయి. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత ఖరీఫ్‌లో పంటల సాగు గణాంకాలు పక్కాగా సేకరించడంలో ఆ శాఖ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. గ్రామ గ్రామాన రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే) ఉన్నాయి. వ్యవసాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఇలా పెద్ద వ్యవస్థ ఉన్నా గ్రామాల వారీగా పంటల సాగు విస్తీర్ణం లెక్కలు తేల్చలేని పరిస్థితి నెలకొంది. వారం వారం కొంచెం కొంచెం విస్తీర్ణం పెంచి చూపిస్తున్నారు తప్పితే కచ్చితత్వం లేకుండా పోయింది.

వర్షాలు లేకున్నా అలా పెంచేశారు..

జూన్ 1 నుంచి ఖరీఫ్ మొదలు కాగా ఎన్నడూ లేని విధంగా ఈ సారి జూన్ 2న కీలకమైన 'నైరుతి' రుతుపవనాలు ప్రవేశించాయి. జూన్ 14వ తేదీ వరకు జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడ్డాయి. జూన్ నెల సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా జూన్ 14 నాటికే ఏకంగా 143 మి.మీ వర్షం కురిసింది. జూన్ 15 నుంచి జూలై 15 వరకు ఖరీఫ్‌లో వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న తదితర పంటల సాగుకు సరైన సమయంగా ప్రకటించారు. దీంతో జూన్ 14 వరకు కురిసిన వర్షాలకు రైతులు పంటలు కొంత వరకు సాగు చేశారు. జూన్ 15 నుంచి జూలై 15 వరకు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అరకొరగా కురిసిన వర్షాలకు పంటల సాగు కొనసాగించారు. మొత్తమ్మీద జూన్‌లో 61 మి.మీ గానూ 142.1 శాతం అధికంగా 147.7 మి.మీ, జూలైలో 63.9 మి.మీ గానూ 61.8 శాతం తక్కువగా కేవలం 24.4 మి.మీ వర్షం కురిసింది. కీలకమైన జూలైలో వర్షాలు లేక ఖరీఫ్ పంటల సాగు పడిపోయింది. ఇక ఆగస్టులో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది. 83.8 మి.మీ గానూ ప్రస్తుతానికి 46.7 మి.మీ నమోదైంది.

సాగు అంచనాలపై అనుమానం..

జూన్ 15 తర్వాత వ్యవసాయశాఖ ఖరీఫ్ సాగు విస్తీర్ణం లెక్కలు వారం వారం విడుదల చేస్తోంది. జిల్లాలో జూన్ రెండో పక్షంలో పంటలు వేయగా, ఆ తర్వాత జూలైలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలకు పంటలు వేశారు. అసలు వర్షమే నమోదు కాని సమయాల్లో కూడా లెక్కలు పెంచి చూపించారు. ఈ ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 3.76 లక్షలు హెక్టార్లుగా అంచనా వేశారు. అయితే వ్యవసాయశాఖ జూలై 15న కేవలం 18 శాతంతో 62,522 హెక్టార్లలో పంటలు వేసినట్లు చూపించారు. ఆ తర్వాత జూలై 20న 24 శాతంతో 83,839 హెక్టార్లుగానూ, జూలై 30న 31 శాతంతో 1.06 లక్షల హెక్టార్లుగానూ, ఆగస్టు 5న 41 శాతంతో 1.43 లక్షల హెక్టార్లలో పంటలు వేసినట్లు చూపించారు. ఈనెల 12న 58 శాతం విస్తీర్ణంతో 2.02 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగైనట్లు వెల్లడించారు. ఒకట్రెండు రోజుల్లో విడుదల చేసే సాగు గణాంకాలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాలు లేకున్నా వారం వ్యవధిలోనే వేలాది ఎకరాలు పెరగడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కరుణించని సర్కారు..

ఇప్పటికే ఖరీఫ్‌పై ఆశలు కోల్పోయిన రైతులు కనీసం ప్రత్యామ్నాయమైనా చూసుకుందామని అనుకున్నా చంద్రబాబు సర్కారు విత్తనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. ప్రత్యామ్నాయ పంటలు విత్తుకునేందుకు మంచి సమయమైనా విత్తనం లేక ఇబ్బంది పడుతున్నారు.

విత్తన సరఫరా నిల్..

ప్రత్యామ్నాయ విత్తనాలు 80 శాతం రాయితీతో పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక క్వింటా కూడా సరఫరా చేయలేదు. జిల్లా రైతులకు 21,791 క్వింటాళ్ల ఉలవలు, 1,501 క్వింటాళ్ల పెసలు, అలసందలు 3,253 క్వింటాళ్లు, 973 క్వింటాళ్ల జొన్నలతో పాటు 369 క్వింటాళ్లు కొర్రలు, 20 క్వింటాళ్ల మినుము విత్తనాలు ఇస్తామని కార్యాచరణ రూపొందించినా ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. విత్తన రిజిస్ట్రేషన్లు కూడా చేపట్టలేదు.

సుఖీభవ, బీమా సాయం కూడా లేదు..

గత ఐదేళ్లు జూన్, జూలైలోనే రైతు భరోసా–పీఎం కిసాన్ కింద రైతులు మొదటి విడతగా రూ.7,500 ప్రకారం పెట్టుబడిసాయం, ఉచిత పంటల బీమా కింద ఏటా పెద్ద మొత్తంలో పరిహారం అందుకున్నారు. నేడు ఖరీఫ్ ఆరంభమై రెండు నెలలు పూర్తవుతున్నా చంద్రబాబు సర్కారు పట్టించుకోవడం లేదు. 'వైఎస్సార్ రైతు భరోసా'ను 'అన్నదాత సుఖీభవ'గా పేరుమార్చినా ఇప్పటివరకు పైసా కూడా విదల్చలేదు. ఇక.. పంటల బీమా పథకం, పరిహారం ఊసే మరచిపోయారు. రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని గొప్పగా చెప్పిన నేతలు పత్తా లేకుండా పోయారు.

జిల్లాలో స్తంభించిన వైద్య సేవలు



అనంతపురం టవర్‌క్లాక్ వద్ద జూడాలు, విద్యార్థినుల మానవహారం



సర్వజనాస్పత్రిలో డాక్టర్ల కోసం నిరీక్షిస్తున్న రోగులు

అనంతపురం మెడికల్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని ఖండిస్తూ జూనియర్ డాక్టర్లు నిర్వహించిన సమ్మెతో జిల్లాలో వైద్య సేవలు స్తంభించాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో శనివారం ఓపీ సేవలు నిలిపివేయడంతో రోగులు అవస్థలు పడ్డారు. సర్వజనాస్పత్రిలో కొన్ని ఓపీల్లో వైద్యులు కన్పించలేదు. దీంతో రోగులు గంటల తరబడి నిరీక్షించారు. వార్డుల్లో స్టాఫ్ నర్సులు, నర్సింగ్ విద్యార్థినులు సేవలందించారు.

కఠిన చట్టాలు తీసుకురావాలి..

ప్రాణాలు సైతం లెక్క చేయకుండా సేవలందిస్తున్న వైద్యులకు భద్రతపై స్పష్టత ఇవ్వాలని ఆప్ జూడా అధ్యక్షుడు హరికిరణ్ డిమాండ్ చేశారు. శనివారం ఆప్ జూడా ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. పీజీ వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్లు, మహిళా సంఘాలు, నర్సింగ్ విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీరికి ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్, ఏపీజేఏసీ అమరావతి నాయకులు సంఘీభావం తెలిపారు. మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆప్ జూడా నాయకులు ఆరిఫ్, సాయి, లీలా, శ్రావణి, ప్రత్యూష, ఏపీ జేఏసీ అమరావతి–అనంతపురం జిల్లా చైర్మన్ దివాకర్ రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్, మహిళా విభాగం సురేఖరావు, నీరజ, భరత్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎయిడ్స్ నివారణపై విస్తృతంగా అవగాహన కల్పించండి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఐఓ డాక్టర్ యుగంధర్, వైద్యులు

గుంతకల్లుటౌన్: ఎయిడ్స్ నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ యుగంధర్ తెలిపారు. శనివారం తిలక్‌నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు మీకు తెలుసా? పేరిట ముద్రించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. హెచ్ఐవీ ఎలా వస్తుంది? వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి సూచించారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ స్వాతి, డాక్టర్ సజీవ్‌కుమార్, డాక్టర్ రఘునందన్, ఐసీటీసీ కౌన్సిలర్లు ప్రసాద్, పీరానాయక్, ప్రగతి మైత్రీ పీడీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి సన్నిధిలో పాండిచ్చేరి హోంమంత్రి, 'అనంత' మాజీ ఎస్పీ



శ్రీవారిని దర్శించుకుంటున్న పాండిచ్చేరి హోంమంత్రి తిరు ఓంనమఃశివాయ

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని శనివారం పాండిచ్చేరి హోం మంత్రి తిరు ఓంనమఃశివాయ, అనంతపురం మాజీ ఎస్పీ కేవీ మురళీకృష్ణ దర్శించుకున్నారు. ఆలయం వద్దకు రాగానే ఆలయ అధికారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం వారిని దుశ్శాలువాలో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేసి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ డీఎస్పీ శ్రీలత, తహసీల్దార్ మురళీకృష్ణ, సీఐ నారాయణరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సరుకు మాయం..
నాణ్యత ఘోరం!

- తాడిపత్రి పట్టణం కృష్ణాపురంలోని ఒక అంగన్‌వాడీ సెంటర్‌కు ఈ నెల కోటాకు సంబంధించి 14 కిలోల ప్రీస్కూల్ బియ్యం రాలేదు. సదరు అంగన్‌వాడీ టీచర్ డీలర్‌ను అడిగితే రైస్ గోడౌన్ నుంచి రాలేదని చెబుతున్నాడు. కృష్ణాపురంలోని మరో రెండు సెంటర్లకూ 37 కిలోల కందిపప్పు తక్కువ వచ్చింది. జయనగర్ కాలనీలోని ఒక సెంటర్‌కు బియ్యం, కందిబేడలు, నూనె రాలేదు. దీనిపై ఆయా సెంటర్ల టీచర్లు సూపర్‌వైజర్‌కు ఫిర్యాదు చేశారు. సరుకులు లేకపోతే పిల్లలకు ఎలా వండి పెట్టాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు.
- తాడిపత్రిలోని హరిజనవాడ, సుంకులమ్మ పాలెం, పాతకోట, సీపీఐ కాలనీల్లోని అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చిన కందిబేడలు ముద్దకట్టి దుర్వాసన వస్తున్నాయి. అంతేకాకుండా 20 కిలోల కందిబేడలు తక్కువ వచ్చాయి. నాణ్యమైన కందిబేడలు ఇవ్వాలని గోడౌన్ సిబ్బందిని అడిగితే స్టాకు లేదని చెబుతున్నట్లు తెలిసింది.



తాడిపత్రిలోని ఓ అంగన్‌వాడీ సెంటర్‌కు అందించిన కందిబేడలు ముద్దకట్టిన దృశ్యం

- అంగన్‌వాడీ సరుకుల పంపిణీలో గోల్‌మాల్
- అందిన వాటిలోనూ తీసికట్టుగా నాణ్యత
- గగ్గోలు పెడుతున్న అంగన్‌వాడీ టీచర్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి సమీపంలోని చిన్నపాలమడ వద్ద రైస్ గోడౌన్ ఉంది. ఇక్కడి నుంచి బియ్యం, కందిబేడలు, నూనె ప్యాకెట్లను తాడిపత్రిలోని 66 అంగన్‌వాడీ కేంద్రాలు, తాడిపత్రి మండలంలో 65, పెద్దపప్పూరు మండలంలో 42, యల్లనూరులో 49, పుట్లూరులో 46 అంగన్‌వాడీ సెంటర్లకు డీలర్ల ద్వారా రవాణా చేస్తారు. గర్భిణులు, బాలింతలకు ఒక్కొక్కరికి మూడు కిలోల ప్యాకెట్ బియ్యం, కిలో కందిబేడలు, 450 గ్రాముల నూనె ప్యాకెట్ చొప్పున పంపిణీ చేయాల్సి ఉంటుంది. గోడౌన్‌లో సరుకులను తీసుకునేటప్పుడు ఆర్ఓ ప్రకారం తనిఖీ చేసుకోవాలి. కానీ డీలర్లు గోడౌన్‌లో వేలిముద్ర వేసిన వెంటనే ఆర్ఓ తీసుకొస్తున్నారే తప్ప సరుకులను సరిచూసుకోవడం లేదు. ఈ క్రమంలో తక్కువ వచ్చాయని చేతులెత్తేస్తూ వచ్చిన సరుకులను సెంటర్లకు ఇస్తున్నారు. తాడిపత్రి అంబేడ్కర్ నగర్‌లోని ఓ అంగన్‌వాడీ సెంటర్‌కైతే సక్రమంగా సరుకులను ఇవ్వకుండా డీలర్ వేధిస్తున్నట్లు తెలిసింది.

ముద్ద కట్టిన కందిబేడల ప్యాకెట్లు..

అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత తీసికట్టుగా ఉంటోంది. కందిబేడల ప్యాకెట్లు ముద్దలు కట్టి దుర్వాసన వెదజల్లుతున్నాయి. వీటిని లబ్ధిదారులకు ఎలా అందజేయాలో అంటూ టీచర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రీస్కూల్ కింద విద్యార్థులకు వంట చేయడానికి అవసరమైన బియ్యం, కందిబేడలు, నూనె కూడా సరఫరా చేయలేదని టీచర్లు చెబుతున్నారు. ఎక్కడి నుంచి తెచ్చి వారికి వంట చేయాలని ప్రశ్నిస్తున్నారు. స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంతో గగ్గోలు పెడుతున్నారు.

సరుకులు తెచ్చుకునేందుకూ అవస్థలు..

గత ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా డీలర్లు నేరుగా అంగన్‌వాడీ సెంటర్లకు సరుకులు తీసుకొచ్చి ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో అంగన్‌వాడీ వర్కర్లకు కష్టాలు మొదలయ్యాయి. ఒక్కో సెంటర్ నుంచి రూ. 100 ఇస్తేనే సరుకులను గోడౌన్ నుంచి తెస్తామని పలువురు డీలర్లు తెగేసి చెబుతుండడంతో, అంత డబ్బు పెట్టుకోలేక తప్పనిసరి పరిస్థితుల్లో పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలోని గోడౌన్ నుంచి ఆటోల్లో సరుకులు తీసుకొస్తున్నారు.

నా దృష్టికి రాలేదు



అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా అవుతున్న సరుకుల్లో తేడాల గురించి నా దృష్టికి రాలేదు. నాణ్యమైన సరుకులు అందేలా చూస్తాం. ముద్దకట్టి దుర్వాసన వస్తున్న కందిబేడల ప్యాకెట్లను ఉపయోగించరాదని చెప్పాం. వాటి స్థానంలో కొత్త వాటిని అందిస్తాం.

– సాజీదా బేగం, సీడీపీఓ, తాడిపత్రి

విచారణ జరుపుతాం



పలు అంగన్‌వాడీ సెంటర్లకు సరుకులు పంపిణీ కాకపోవడంపై విచారణ చేస్తాం. డీలర్లు పంపిణీ చేయకుంటే చర్యలు తీసుకుంటాం. గోడౌన్ ఇన్‌చార్జ్‌తో మాట్లాడతాం. ఎన్ని సెంటర్లకు సరుకులు సక్రమంగా సరఫరా కాలేదన్న వివరాలను అందించాలని సీడీపీఓను ఆదేశిస్తాం. – ఆంజనేయ ప్రసాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్, తాడిపత్రి

పలువురు సీఐల బదిలీ

అనంతపురం: కర్నూలు రేంజ్ పరిధిలో పలువురి సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వి. చిన్న పెద్దయ్య సీసీఎస్, అన్నమయ్య సీఐను వీఆర్ (అనంతపురం రేంజ్)కు బదిలీ చేశారు. అలాగే సీఐ నరేంద్రరెడ్డిని కడప పోలీస్ కంట్రోల్ రూంకు శుక్రవారం బదిలీ చేయగా, తాజాగా శనివారం బదిలీని నిలుపుదల చేశారు.

- అనంతపురం జిల్లా పరిధిలో ఎస్ఐ బి. తులసమ్మ (వీఆర్ ఎస్పీ, శ్రీ సత్యసాయి)ని అనంతపురం పోలీస్ కంట్రోల్ రూంకు , తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.సాగర్‌ను నార్పల పోలీస్‌స్టేషన్‌కు, నార్పలలో పనిచేస్తున్న ఎస్ఐ ఎస్.రాజశేఖర్ రెడ్డి వీఆర్ ఎస్పీకి బదిలీ చేశారు.

పారా మెడికల్ కోర్సుల దరఖాస్తు గడువు పొడిగింపు



అనంతపురం మెడికల్: పారా మెడికల్ కోర్సుల దరఖాస్తు గడువును ఈ నెల 19 వరకు పొడిగించినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. ఈ మేరకు వైద్య కళాశాల కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. డీఎంఎల్‌టీ, డీఓఏ, డీఎఎన్ఎస్, డీఎంఐటీ, డీఇసీజీ, డీఆర్‌జీఏ, డీడీఆర్ఏ తదితర కోర్సులకు ఇంటర్మీడియట్ విద్యార్హతతో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి కింద తెల్పిన వెబ్‌సైట్‌లో మరిన్ని వివరాలను తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. www.appmb.crg.in,http://dme.ap.nic.in

వివాహిత అనుమానాస్పద మృతి



మృతురాలు జయలక్ష్మి

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో ఓ వివాహిత అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులరెడ్డికి కడవకల్లు గ్రామానికి చెందిన జయలక్ష్మితో 18 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. శుక్రవారం గ్రామస్తులు వర్షం కోసం శింగనమల మండలం గంపమల్లయ్య స్వామి కొండకు వెళ్లగా జయలక్ష్మి భర్త శ్రీనివాసులరెడ్డి వారితో పాటు వెళ్లారు. ఇంటి వద్ద ఆమె తన చిన్నకుమారుడితో కలిసి ఉంది. అయితే జయలక్ష్మి శనివారం ఉదయం ఇంటి బయట ఉన్న పాకలో తలకు బలమైన గాయంతో విగతజీవిగా పడి ఉంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ హేమాద్రి పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించడంతో పాటు పోలీసు జాగిలాలతో విచారణ చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

• కనువిందు చేస్తున్న కోన జలపాతాలు



ఆహ్లాదం పంచుతున్న కోనలోని మారడమ్మ జలపాతం

యాడికి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతాలు పొంగి పొర్లుతున్నాయి. ప్రధానంగా నంద్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు వర్షపు బూరుగుల, సీతమ్మ తాండా, కొలుపల్లె నుంచి వచ్చే వర్షపునీటితో కోన క్షేత్రంలోని మారడమ్మ, కోన జలపాతాలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. భారీగా వర్షపు నీరు జలపాతాల ద్వారా వస్తుండటం చూపరులను ఆకట్టుకుంటోంది. పెద్దసంఖ్యలో జనాలు తరలివచ్చి జలపాతాల వద్ద సందడి చేస్తున్నారు.

రూ.16.83 కోట్లతో ఉద్యాన పథకాలు

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది రూ.16.83 కోట్ల బడ్జెట్‌తో ఉద్యాన పథకాలు అమలు చేయనున్న నేపథ్యంలో ఆర్ఎస్‌కే వేదికగా అర్హులైన రైతులను గుర్తించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి బీఎంవీ నరసింహారావు ఆదేశించారు. శనివారం స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి హాజరై డ్రిప్, స్ప్రింక్లర్ల రిజిస్ట్రేషన్, మంజూరులో ఉద్యానశాఖ అధికారులు సహకరించాలని కోరారు. కొత్తతోటల విస్తరణ, పాత తోటల పునరుద్ధరణ యాంత్రీకరణ, ఫారంపాండ్లు, మల్చింగ్, ప్యాక్‌హౌస్, కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూంలు, అలాగే ఈ సారి కొత్తగా ఆరు మండలాల పరిధిలో ఆయిల్‌ఫాం తోటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎంఐడీహెచ్ కింద రూ.14.53 కోట్లు, ఆర్‌కేవీవై కింద రూ.1.29 కోట్లు, ఆయిల్‌ఫాం కింద రూ.1.01 కోట్లు బడ్జెట్ కేటాయించినందున గడువులోగా పథకాలు అమలు చేయాలని ఆదేశించారు. అలాగే ఉద్యాన పంటల్లో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు.



హెచ్‌వోలతో సమావేశమైన డీడీ హెచ్ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి

జాతీయ రహదారిపై ప్రైవేటు బస్సు బోల్తా

- స్వల్పగాయాలతో బయట పడిన ప్రయాణికులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రం వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం ప్రైవేటు బస్సు బోల్తాపడింది. ఘటనలో ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వివరాలు.. హైదరాబాద్ నుంచి ప్రైవేటు బస్సు ప్రయాణికులతో బెంగళూరు బయలుదేరింది. తెల్లవారుజామున చెన్నేకొత్తపల్లి వద్దకు రాగానే బస్సు అదుపు తప్పి జాతీయ రహదారిపై రోడ్డుపై అడ్డంగా బోల్తాపడింది. ప్రయాణికుల అరుపులు విన్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని బస్సు అద్దాలను పగుల గొట్టి ప్రయాణికులను బయటకు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 33 మంది ప్రయాణికులు ఉన్నట్లు మరో డ్రైవర్ బాబురావు తెలిపారు. బస్సు రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్ కొంతసేపు స్తంభించింది. అయితే ఈ ప్రమాదంలో ఆ సమయంలో బస్సును నడుపుతున్న డ్రైవర్ రమేష్ తలకు చిన్న గాయం కావడంతో స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వాటిని లెక్కచేయకుండా ఇతర వాహనాల్లో బెంగళూరుకు వెళ్లిపోయారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను మళ్లించారు. తర్వాత జేసీబీ, క్రేన్‌తో బస్సును రోడ్డుపై నుంచి తొలగింపజేశారు.



చెన్నేకొత్తపల్లి వద్ద జాతీయ రహదారిపై అడ్డంగా పడిన ట్రావెల్స్ బస్సు

విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి



మృతుడు సుబ్బరాయుడు

కంబదూరు: గూళ్యం గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన హరిజన సుబ్బరాయుడు(46) శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈక్రమంలో లక్ష్మిరెడ్డికి చెందిన పొలం గట్టుదాటుతూ ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకాడు. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సుబ్బరాయుడు రాత్రంతా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించగా తోటలో విగతజీవిగా కనిపించాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

పామిడి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ ఎం రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. స్థానిక నాగిరెడ్డికాలనీలో ఉంటున్న ప్రైవేట్ టీచర్ చాంద్‌బాషా, పామిడి కేజీబీవీ ఉద్యోగిని షంషాద్‌కు ఎస్ తాకీర్, ఎస్ బీబీ సంతానం. తాకీర్ గుత్తి గేట్స్ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. తాకీర్(17) గుత్తి గేట్స్ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. శుక్రవారం మసీదులో ప్రార్థనల అనంతరం తాకీర్ తెలిసిన వారి బైక్‌పై పామిడి నుంచి గుత్తి గేట్స్ కళాశాలకు బయలుదేరాడు. పొగరూరు గ్రామ సమీపాన కుక్క అడ్డురావడంతో బైక్‌ను నియంత్రించలేక రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు పామిడి కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పెనకచెర్ల హెల్త్ వెల్‌నెస్ సెంటర్ తనిఖీ

గార్లదిన్నె: పెనకచెర్ల గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం జాతీయ నాణ్యత నిపుణుల బృందం తనిఖీ చేసింది. ఈసందర్భంగా బృందం సభ్యులు ఆరోగ్య కేంద్రంలోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న ఆరోగ్య సేవలపై సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం మండల కేంద్రానికి దూరంగా ఉందని, అయినా ప్రజలకు సేవలు సక్రమంగా అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. గతేడాది కేశవాపురం, మర్తాడు, సెంటర్‌ను తనిఖీ చేశామని, వాటికి సర్టిఫికెట్లు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. జాతీయ నాణ్యత నిర్వహణ నిపుణులు డాక్టర్ బిందు, డాక్టర్ భాగ్యవతి యతీశ్, అనుసంధాన అధికారి స్టీఫెన్, పీహెచ్‌సీ డాక్టర్ హనీషా, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



హెల్త్ వెల్‌నెస్ సెంటర్ వద్ద నాణ్యత నిపుణుల బృందం

జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో..
సాక్షి ఫొటోగ్రాఫర్‌కు అవార్డు



బహుమతికి ఎంపికైన ఫొటో ఇదే(ఇన్‌సెట్‌లో) వీరేష్

అనంతపురం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో జిల్లా సాక్షి ఫొటోగ్రాఫర్ వీరేష్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ నిర్వాహకులు రూబెన్ బిసాలియల్, న్యాయనిర్ణేతలు డాక్టర్ అనిత్, సీహెచ్. నారాయణరావు, సిహెచ్.మస్తాన్ సమాచారమందించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జేఎన్‌టీయూ వద్ద ఏర్పాటు చేసిన కంచె దాటుతున్న వృద్ధురాలి ఫొటోను వీరేష్ క్లిక్ మనిపించారు. ఈ చిత్రం అచీవ్‌మెంట్ అవార్డును తెచ్చిపెట్టింది.త్వరలో విజయవాడ వేదికగా అవార్డు అందుకోనున్నారు.

భక్తులతో పోటెత్తిన కసాపురం





హనుమంత వాహనంపై కొలువుదీరిన సీతారామలక్ష్మణులు, స్వామివారి ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

- హనుమద్ వాహనంపై ఊరేగిన సీతారామలక్ష్మణులు

గుంతకల్లు రూరల్: శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో పోటెత్తింది. ఆంజనేయస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సీతారామలక్ష్మణులు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శనివారం వేకువజామునే నెట్టికంటుడికి మహాభిషేకాలు నిర్వహించిన అర్చకులు స్వామివారిని వజ్రకవచ అలంకరణలో తీర్చిదిద్దారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల జిల్లాలనుండే కాకుండా, కర్ణాటక, తెలంగాణల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారి దర్శనానంతరం భక్తులకు బెల్దోణ సత్రంలో అన్నదానం చేపట్టారు. సాయంత్రం సీతారామలక్ష్మణులను హనుమంత వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను పల్లకీపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రకారోత్సవం నిర్వహించారు.



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

క్లుప్తంగా

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నిక

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నిక శనివారం ప్రశాంతంగా జరిగింది. గతంలో కోరం లేనందున ఎన్నిక వాయిదా పడింది. ఎన్నికలు ఎంఈఓలు నరసింహారెడ్డి,రామాంజనేయులు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వడ్డుపల్లిలో గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు లక్ష్మీదేవి చైర్‌పర్సన్‌గా, వైస్ చైర్మన్‌గా గంగన్న ఎంపికయ్యారు. సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణస్వామి పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20, 21న ఆత్మకూరు సచివాలయంలో, 22,23న మదిగుబ్బ, బి.యాలేరు సచివాలయాల్లో, 24న సనప, రంగంపేట పంచాయతీల పరిధిలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్: అనంతపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు 40 రోజుల పాటు ఇంగ్లిష్ గ్రామర్‌పై ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు లక్ష్మీనారాయణ, రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకూ శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9290200675 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పన్నులు పక్కాగా వసూలు చేయాలి



ఫీజు వసూలు కౌంటర్‌ను పరిశీలిస్తున్న సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి

అనంతపురం అగ్రికల్చర్: వారాంతాల్లో జరిగే పశువులు, జీవాల సంతల్లో పక్కాగా పన్ను వసూలు చేయాలని వ్యవసాయ మార్కెట్‌కమిటీ సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి ఆదేశించారు. శనివారం జీవాల సంతను ఆమె పర్యవేక్షించారు. నిబంధనల మేరకు గొర్రెలు, మేకల క్రయ విక్రయాలకు, రవాణా వాహనాల నుంచి రుసుం కచ్చితంగా వసూలు చేయాలని గ్రేడ్-2 సెక్రటరీ రూప్‌కుమార్, సూపర్‌వైజర్లు కేశవకుమార్, నాగేంద్ర, కృపావతి తదితరులకు సూచనలు చేశారు. వాచ్‌మెన్లు, గేట్‌కీపర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాల్లో మోతాదుకు మించి జీవాలు తరలించకుండా చూడాలన్నారు. సీసీ కెమెరాల పనితీరు, వర్షాలకు చిత్తడి అయిన మార్కెట్‌యార్డును పరిశీలించారు. శ్రావణ మాసం, ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు తక్కువగా వస్తుండటంతో ఇటీవల ఆదాయం తగ్గినట్లు తెలిపారు. రైతులు, వ్యాపారులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ముందస్తుగానే యార్డును శుభ్రం చేయాలని సూచించారు.

నాణ్యమైన విద్య అందిద్దాం



కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు

ఆత్మకూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మండలంలోని ప్రధానోపాధ్యాయులతో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు ఉపాధ్యాయులకు పలు సూచనలు తెలియజేశారు. కష్టమైన సబ్జెక్టులను ఏ విధంగా బోధించాలో? తరగతి గదుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఎలాంటి ప్రత్యేక శ్రద్ధ చూపించాలో తెలియజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



చిన్నపల్లిలో ప్రతిష్ఠించిన దేవతామూర్తులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని చిన్నపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా వేద పండితులు ఆలయంలో హోమాలు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం ఆలయంలో సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామ చంద్రస్వామి విగ్రహాలను వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణ మధ్య ప్రతిష్ఠ గావించారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో సీడబ్ల్యూసీ సభ్యుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కేటీ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువా.. డీఈఓ కార్యాలయ ఆవరణమా!

- చిన్న వర్షం వస్తే చెరువును తలపిస్తున్న డీఈఓ కార్యాలయ ప్రాంగణం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు
- పట్టించుకోని అధికారులు



డీఈఓ కార్యాలయానికి వెళ్లే ప్రధాన గేటు వద్ద ఇలా...



గేటు లోపలికి వెళ్లగానే ఇలా

అనంతపురం ఎడ్యుకేషన్: చిన్నపాటి వర్షానికే కుంటలా మారే డీఈఓ కార్యాలయ ఆవరణం పెద్ద వర్షం వస్తే చెరువును తలపిస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఉద్యోగులు, కార్యాలయంలో పని కోసం వచ్చే ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. నగరంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ హాస్టల్ పక్కనే ఉన్న డీఈఓ కార్యాలయ ఆవరణం శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువులా తయారయింది. కార్యాలయానికి వెళ్లాలంటే నిల్వ ఉన్న వర్షం నీటిలో పడుతూ లేస్తూ వెళ్లాల్సిందే. డీఈఓ కార్యాలయానికి రోజూ వందలాదిమంది టీచర్లు, ప్రజలు వస్తుంటారు. ముఖ్యంగా మహిళలు వర్షం నీటిలో వెళ్లలేక పడుతున్న ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. వర్షం పడితే చాలు డీఈఓ కార్యాలయానికి పనిమీద వచ్చేవాళ్లు పనులు వాయిదా వేసుకునే పరిస్థితి దాపురిస్తోంది. బైకుల్లో వచ్చే కార్యాలయ ఉద్యోగులు విన్యాసాలు చేస్తూ వెళ్తున్నారు.ఈక్రమంలో అదుపుతప్పి బైకులు పడిన సందర్భాలు చాలా ఉన్నాయని ఉద్యోగులు వాపోతున్నారు.

కార్లలో వస్తారు...కనిపించడం లేదు

జిల్లా విద్యాశాఖ అధికారి కారులో వస్తారు. కాబట్టి తమ ఇబ్బందులు కనిపించడం లేదని స్వయంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షానికే మైదానమంతా బురదగుంటలా మారి జారి పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీటిని తొలిగించేందుకు అధికారులు కనీసం చర్యలు తీసుకోవడం లేదు. జిల్లా కలెక్టరైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారుల్లో తీవ్ర నిర్లక్ష్యం

డీఈఓ కార్యాలయ ఆవరణలో వర్షం నీరు నిల్వ ఉంటూ వచ్చేవారికి తీవ్ర అసౌకర్యం కల్గిస్తున్నా అధికారులు నిర్లక్ష్యం వీడడంలేదు. ఇటీవల కాలంలో కార్యాలయంలోకి వెళ్తూ పలువురు జారి పడ్డారు. సిబ్బంది కూడా బాధితులే. అయినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. పక్కా భవనం నిర్మించి డీఈఓ కార్యాలయాన్ని అక్కడికి మార్చాలి.



– కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

హత్యాచార దోషులను ఉరితీయాలి



ఎస్కేయూలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు



ఆర్డీటీ ప్రధాన కార్యాలయం ముందు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, విశాల ఫెర్రర్

అనంతపురం: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన దోషులను వెంటనే ఉరితీయాలంటూ ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, జీఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ముందు శనివారం రాత్రి ఆందోళనలు నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. మృతురాలికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. దోషులకు తక్షణమే ఉరిశిక్ష అమలు చేయాలని, ఎవరైనా ఇలాంటి ఘటనలకు పాల్పడాలంటే భయపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధికారి ప్రతినిధి పులిరాజు, చంద్రశేఖర్, జీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నాయక్ తదితరులున్నారు.

☛ కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచారం ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతి కలిగించిందని ఆర్డీటీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్, ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ అన్నారు. ట్రైనీ డాక్టర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. ట్రైనీ డాక్టర్ చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

హంతకుడిని కఠినంగా శిక్షించాలి

ఆత్మకూరు: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్యను ఖండిస్తూ శనివారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఇంతటి దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.కార్యక్రమంలో డాక్టర్ భార్గవి, స్టాఫ్ నర్సు సుజాత, పీహెచ్ఎన్ తులసమ్మ, హెచ్ఓ షమీమ్, ఫార్మసిస్ట్ భాను, ఎల్‌టి జీవన్, ఏఎన్ఎమ్‌లు అలివేలమ్మ, ఆశాకార్మికులు రమణమ్మ, అలివేలమ్మ, సుభద్రమ్మ, నరసమ్మ, మాంబావతి, చంద్ర పాల్గొన్నారు.

రాప్తాడు: మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యల నుంచి రక్షణ కల్పించాలని ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శివ కృష్ణ డిమాండ్ చేశారు.



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నరసింహా రెడ్డి, సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ నరసింహ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బంది, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారి ఆపరేషన్‌కు అమ్మ చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న అమ్మ సంస్థ రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి దాతృత్వం చాటారు. ఓ చిన్నారి ఆపరేషన్‌కు సాయమందించారు. వివరాలు.. నగరానికి చెందిన శివ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన మూడో కుమార్తె నేత్ర మలద్వారం లేకుండా జన్మించింది. దాంతో నిత్యం తీవ్ర ఇబ్బందికి గురయ్యేది. వైద్యులను సంప్రదిస్తే ఆపరేషన్ ద్వారా సమస్య పరిష్కారమవుతుందని, అందుకు రూ.50 వేలు ఖర్చవుతుందని తెలిపారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న ఆ కుటుంబానికి దిక్కు తోచలేదు. విషయం తెలుసుకున్న రమణా రెడ్డి డాక్టర్ హరిప్రసాద్‌తో మాట్లాడి రూ. 25 వేలకు ఆపరేషన్ నిర్వహించేలా ఒప్పించారు. ఈ క్రమంలో రమణారెడ్డి శనివారం ఆ కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సాయమందించారు. భవిష్యత్తులో కూడా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో వ్రతాలు





ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు, పూజలు చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ఎఫ్‌రోడ్డు, రామనగర్, హౌసింగు బోర్డుల్లోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాలలో శనివారం వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మహిళలు బారులు తీరి వ్రతం ఆచరించారు. శనిత్రయోదశి వేడుకలు కూడా రావడంతో శివబాలయోగి ఆశ్రమంలో శ్రావణ మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, తులసి అర్చన, అడ్డుపడి పూజలు, శనేశ్వరుడికి తైలాభిషేకాలు ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం, అన్నసంతర్పణ జరిగాయి. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు జూటూరు అరవింద్, రత్నగిరి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా భారీ వర్షం



చెన్నేకొత్తపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవంక

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. చెన్నేకొత్తపల్లి నుంచి వెంకటంపల్లి గ్రామానికి వెళ్లే దారిలో పెద్ద వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో రాకపోకలు స్తంభించిపోయాయి. మండలంలోని చిన్నపురెడ్డిపల్లి గ్రామం వద్ద చిత్రావతి నది ఉధృతంగా ప్రవహించింది. ధర్మవరం పుట్టపర్తి రహదారిలో చెన్నేకొత్తపల్లి మండలం సరిహద్దులో ఉన్న వంగపేరు జోరుగా పారింది. దీంతో పుట్టపర్తి నుంచి ధర్మవరం వెళ్లే బస్సులను దారి మళ్లించారు.



చిన్నపురెడ్డిపల్లి వద్ద వంతెనపై ప్రవహిస్తున్న చిత్రావతి నది

కనగానపల్లిలో 54.6 మి.మీ వర్షం

కనగానపల్లి: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కనగానపల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో సుమారు 54.6 మి.మీ. వర్షం కురిసినట్లు స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపారు. దీంతో కనగానపల్లి, కుర్లపల్లి, దాదులూరు, ముక్తాపురంతో పాటు పలుచోట్ల వాగులు, వంకలు పారటంతో నీటి కుంటలు, చెరువుల్లోకి నీరు చేరింది. ఈ ఖరీఫ్‌లో రెండు నెలల తర్వాతా వర్షాలు బాగా కురుస్తుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేందుకు సిద్ధమవుతున్నారు.



కుర్లపల్లి వద్ద కుంటలోకి చేరిన వర్షపు నీరు

ఆర్టీసీ 'గ్రీవెన్స్'కు మంగళం

- మా గోడు వినేదెవరంటున్న ఉద్యోగులు
- గోడకే పరిమితమైన గ్రీవెన్స్‌డే ఫ్లెక్సీ
- అధికారులను అడిగే ధైర్యం లేక సమస్యలతో పోరాడుతున్న కార్మికులు
- ఆర్టీసీపై జిల్లా ఉన్నతాధికారుల అజమాయిషీ లేకపోవడంతో ఇష్టారాజ్యం



గోడకే పరిమితమైన గ్రీవెన్స్‌డే పోస్టరు



ఆర్టీసీ బస్టాండు

అనంతపురం క్రైం: ఆర్టీసీ సంస్థపై జిల్లా ఉన్నతాధికారుల అజమాయిషీ లేకుండా పోయింది. దీంతో అడిగేవారెవరన్న వైఖరి అధికారుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లాగే అధికారులు కూడా విధులకు వచ్చేందుకు సమయపాలన పాటించడం లేదు. అధికారులే అలా ఉంటే సిబ్బంది కూడా వారి బాటే పట్టారు. చిరుద్యోగులు ఎవరైనా కాస్త అంకిత భావంతో పని చేస్తుంటే వారిపై వేధింపులు తప్పడంలేదు. మరింత పనిభారం మోపి వారిని రాచి రంపాన పెడుతున్నారు. తమ సమస్యలను కనీసం ఉన్నతాధికారులకు చెప్పుకునేందుకు కూడా బాధిత ఉద్యోగులకు అవకాశం లేకుండా పోయింది. ప్రతి మంగళవారం నిర్వహించాల్సిన ఉద్యోగుల గ్రీవెన్స్‌ను ఇప్పటి దాకా ఒక్క డిపో మేనేజరు నిర్వహించిన పాపాన పోలేదు. అంతెందుకు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ నుంచి వచ్చిన అర్జీలకే ఆర్టీసీ అధికారులు సరైన రిప్లై కూడా ఇవ్వడం లేదని తెలిసింది.

మంగళం పాడేశారు:

ప్రతి శుక్రవారం డిపోల వారిగా మేనేజర్లు సంస్థ ఉద్యోగుల సమస్యలు, ఇతర ఫిర్యాదులు స్వీకరించాల్సి ఉంటుంది. ప్రతి శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల దాకా వచ్చిన ఫిర్యాలకు సంబంధిత అధికారి 15 రోజుల్లోపు పరిష్కారం చూపించాలి. ఈ గ్రీవెన్స్‌కు సంబంధించి గతంలో 18002004599 టోల్ ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచారు. ఈ క్రమంలో ప్రయాణికుల భద్రత, డిపో పరిధిలో ఇబ్బందులపై అర్జీలు అధికారులు స్వీకరించాల్సి ఉంటుంది. అనంతపురం ఆర్టీసీ డిపోలో ఇలాంటి గ్రీవెన్స్ ఒకటి ఉందన్న విషయాన్ని కూడా అధికారులు మరిచి పోయారు. యూనియన్‌ల నేతలు కూడా సమస్య ఎదురైనప్పుడు ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇవ్వడమేగాని సామాన్య ఉద్యోగి పడే ఇబ్బందులను అధికారికి చెప్పుకునే వేదిక ఉండీ అధికారులు పట్టించుకోక పోతే స్పందించడం లేదు. సగటు ఉద్యోగి ఆవేదన వినిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌ను అధికారులు నిర్వహించకపోవడంపై జిల్లా ఉన్నతాధికారులు కూడా దృష్టి సారించడం లేదు. ఆర్టీసీపై జిల్లా ఉన్నతాధికారుల అజమాయిషీ లేక పోవడంతో అధికారుల వ్యవహారం ఆడింది ఆటగా... పాడింది పాటగా సాగుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని కొనసాగించి ఉద్యోగుల ఇబ్బందులను సంస్థ ఉన్నతాధికారులకు చెప్పుకునే అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

రెండు రోజులుగా ఇంట్లోనే మృతదేహం

బత్తలపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మృతి చెందగా రెండు రోజుల పాటు ఇంట్లోనే మృతదేహం ఉంది. గ్రామస్తులు తెలిపిన సమాచారం.. మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన హరిజన క్రిష్టయ్య(65). అతని భార్య కుళ్లాయమ్మ ఎస్కేయూలో స్వీపర్‌గా పని చేస్తోంది. కుళ్లాయమ్మ, కుమారుడు, కోడలితో కలిసి ఎస్కేయూలోనే అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. క్రిష్టయ్య మాత్రం సంజీవపురంలో ఉంటూ ఆదోని మహాలక్ష్మీమాతను కొలిచేవాడు. ఇంట్లోకి ఎవ్వరినీ రానిచ్చేవాడు కాదు. అయితే రెండు రోజుల క్రితం విరేచనాలతో బాధపడుతూ ఇంట్లోనే ఉన్నాడు. ఈక్రమంలో నిద్రలోనే ప్రాణం కోల్పోయాడు. రెండు రోజులుగా ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో కాలనీవాసులు శనివారం ఇంటి తలుపులు తెరిచి పిలిచినా స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. సహజ మరణం కావడంతో కేసు నమోదు చేయలేదని సమాచారం.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెద్దవడుగూరు: మండలంలోని చిట్టూరు వంక నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డప్ప శనివారం తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుకను రీచ్‌ల నుంచి మాత్రమే తోలుకోవాలని సూచించారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండండి



41వ డివిజన్‌లో ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తితో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో కురుస్తున్న వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు స్పందించి ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. ఈ నెల 16న రాత్రి నగరంలో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేరింది. విషయం తెలుసుకున్న మేయర్ వసీం సమస్యాత్మక ప్రాంతమైన 41వ డివిజన్‌లో పర్యటించారు. నీరు బ్లాక్ కాకుండా పూడికతీత పనులు చేపట్టేలా అధికారులను ఆదేశించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పూడికతీత పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలన్నారు. మేయర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ తదితరులున్నారు.

ప్రత్యామ్నాయ సాగుకు అనుకూల వాతావరణం

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల కురిసిన వర్షాలతో ప్రత్యామ్నాయ పంటలు సాగుకు అనుకూల వాతావరణం నెలకొందని అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డివిజన్ పరిధిలో ఆత్మకూరు 88.2 మి.మీ, బుక్కరాయసముద్రం 88 మి.మీ, రాప్తాడు 86.4 మి.మీ, అనంతపురం 60.4 మి.మీ, గార్లదిన్నె 46.8 మి.మీ, కూడేరు 26.4 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. 64,649 హెక్టార్లకు గానూ ఇప్పటి వరకు 24,477 హెక్టార్లలో ఖరీఫ్ కింద పంటలు వేశారన్నారు. మిగతా 40,172 హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ఉలవ, జొన్న, పెసర, అలసంద, కొర్ర పంటలు అనుకూలమన్నారు. త్వరలో 80 శాతం రాయితీతో విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు. రైతుల దగ్గర విత్తనాలు ఉంటే వేసుకోవచ్చని సూచించారు.

స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీకి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: మ్యానువల్ స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఇన్‌చార్జ్) కుష్బూకొఠారి తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమిటీలో నలుగురు సభ్యులు ఉంటారన్నారు. మ్యానువల్ స్కావెంజర్లు, పారిశుధ్య కార్మికుల కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఇద్దరు, స్కావెంజర్లు, పారిశుధ్య కార్మిక సంఘాల నుంచి ఇద్దర్ని చొప్పున ఎన్నుకుంటామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 21లోగా సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

పునరావృతం కాకుండా చూడాలి

అనంతపురం కల్చరల్: కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ నగరంలోని ఆదర్శ ఫైన్ ఆర్ట్స్ మాస్టర్లు, చిత్రకళ నేర్చుకుంటున్న చిన్నారులు శనివారం ర్యాలీ నిర్వహించారు. తాము గీచిన బొమ్మలతో నిరసనకారులకు సంఘీ భావం తెలియజేశారు. అజయ్, శ్రీనివాసులు, కరిష్మా, భార్గవ మాట్లాడుతూ మహిళలపై సాగుతున్న అత్యాచారాలు, దాడులు హేయమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండు చేశారు. అంతకు ముందు నగర వీధుల్లో సేవ్ గర్ల్ చైల్డ్, ఉయ్ వాంట్ జస్టిస్ అన్న చార్టులతో ర్యాలీ నిర్వహించారు.

అనుబంధాలు వెల్లివిరియాలి



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

అనంతపురం కల్చరల్: మానవులందరి మధ్య అనుబంధాలు వెల్లివిరియాలంటే మన అనే భావన అందరిలో ఉండాలని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం జిల్లా ఇన్‌చార్జ్ సిస్టర్ శారద అన్నారు. రక్షాబంధన్ మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బ్రహ్మకుమారీలు జిల్లాలో ప్రముఖులకు రాఖీలు కట్టారు. కలెక్టర్ వినోద్‌కుమార్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వీర్రాజు, డీఎస్పీ ప్రతాప్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మతో పాటు పలు శాఖల అధికారులు, సిబ్బందికి రాఖీలతో పాటూ స్వీట్లు పంచి రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. రాఖీ పౌర్ణమి వేడుకలను వారం రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.